అత్వెల్లిలో ఉచిత వైద్య శిబిరం



రాంపల్లి వార్డు కార్యాలయం వద్ద చైర్మన్ చంద్రారెడ్డి...



అత్వెల్లిలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన డాక్టర్ ఎం.డి.బషీరుద్దీన్ ఆయన మిత్రులు కలిసి ఆల్‌హష్మి పాలి క్లినిక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైన వారికి ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు.శి బిరాన్ని కౌన్సిలర్లు మానస శ్రవణ్‌కుమార్ గుప్తా, సరిత మల్లేష్‌గౌడ్ దేవ, బీజేపీ నాయకులు ప్రారంభించారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర: కాలనీలు, బస్తీల్లో వివిధ స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి వార్డు కార్యాలయం వద్ద ఆదివారం సిరి ఆస్పత్రి, ఆర్మీ కాలేజీ ఆఫ్ డెంటల్ సైన్స్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ నేతలు గండి అంజయ్యగౌడ్, గోగుల స్వామి, వరకాల పెంటయ్య, బాలేష్, గోక కళావతి తదితరులు పాల్గొన్నారు.

వేగంగా విస్తరిస్తున్న కృత్రిమ మేధ

పోచారం: విద్యార్థులు ఆసక్తి ఉన్న సబ్జెక్టులను నేర్చుకుని, అందులోనే నిష్ణాతులు కావాలని ఏటీఅండ్‌టీ గ్లోబల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధర రావు సిధు అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనిధి యూనివర్సిటీలో నూతనంగా చేరిన బీటెక్ విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ఓరియెంటేషన్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిధు మాట్లాడుతూ... ఇష్టమైన సబ్జెక్టులోని ఒక్క చాప్టర్‌లో విద్యార్థి మంచి పట్టు సాధిస్తే ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఢోకా ఉండదన్నారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు కృత్రిమ మేధ రాకెట్ వేగంతో అభివృద్ధి చెందుతూ అన్ని రంగాలకు విస్తరిస్తోందన్నారు. సుమారు 70 ఏళ్ల క్రితమే కృత్రిమ మేధ పురుడు పోసుకుందన్నారు. ఇటీవల కాలంలో బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్‌కేర్, ఈ-కామర్స్, మార్కెటింగ్, గేమ్స్, సైబర్ సెక్యూరిటీ, మిలటరీ, భాషా అనువాదం, మిలటరీ, విద్య, తయారీ రంగాలలో కృత్రిమ మేధను విస్తారంగా వినియోగిస్తున్నారన్నారు. విద్యార్థులకు తల్లిదండ్రులు కొంత మేరకు స్వేచ్ఛను ఇవ్వాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. యూనివర్సిటీ చాన్సలర్ కేటీ మహి మాట్లాడుతూ.. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని సిలబస్‌లో ఎప్పటికప్పుడు మార్పులు చేస్తామన్నారు. ఉద్యోగమే లక్ష్యంగా కాకుండా మెరుగైన జీవితం కోసం విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రెసిడెంట్ కె.అభిజిత్ రావు, ప్రో చాన్సలర్ డాక్టర్ పి.నర్సింహారెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ చంద్రశేఖర్, తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటీఅండ్‌టీ గ్లోబల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధరరావు





మాట్లాడుతున్న ఏటీఅండ్‌టీ గ్లోబల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ శ్రీధరరావు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

ఇంజినీర్లు అంకితభావంతో పనిచేయాలి

ఘట్‌కేసర్: విద్యాభ్యాసం అనంతరం విద్యార్థులు సమాజం అభివృద్ధి కోసం నిజాయితీ, అంకితభావంతో పని చేయాలని నల్ల మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు, కార్యదర్శి నల్ల మల్లారెడ్డి అన్నారు. ఆదివారం కాచివాని సింగారం దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజినీరింగ్ అటనమస్ కళాశాల మొదటి బ్యాచ్ గ్రాడ్యుయేషన్ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ దివ్య నల్లా మాట్లాడుతూ... విద్యార్థులు తమ నైపుణ్యంతో సమాజానికి నూతన ఆవిష్కరణలు అందజేయాలన్నారు. ప్రత్యేక అతిథి జేఎనీయూ ప్రొఫెసర్, ఎన్ఎంఆర్ఈసీ అకడమిక్ కౌన్సిల్ సభ్యుడు ప్రతాపరెడ్డి మాట్లాడుతూ... ఇంజినీర్లపై ప్రజలు ఆశలు పెట్టుకుంటారన్నారు. ఆధునిక సమాజంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అసాధారణ పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంఆర్ఈసీ ప్రిన్సిపాల్ ఎస్.వి.రమేశ్, సొసైటీ చైర్ పర్సన్ కేతిరెడ్డి సంధ్యావళి, డైరెక్టర్ స్నేహ నల్లా, పరీక్షల నియంత్రణ అధికారి భూషణ్, హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఎన్ఎంఆర్ఈసీ కళాశాలలో విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న నల్ల మల్లారెడ్డి

వేడుకగా గణేషుడి నిమజ్జనం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని మెగా ఇంజినీరింగ్ కళాశాలలో తొమ్మిది రోజులపాటు విశేష పూజలు అందుకున్న వినాయకుడిని శ్రీ లక్ష్మీనారాయణ చెరువులో ఆదివారం నిమజ్జనం చేశారు. అంగరంగ వైభవంగా జరిగిన కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల నుంచి చెరువు వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ఊరేగింపులో విద్యార్థుల డ్యాన్స్‌లు అలరించాయి. అంతకు ముందు కళాశాలలో ఉట్టి కొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మెగా విద్యాసంస్థల వైస్ చైర్మన్ కసిరెడ్డి మాలతీ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిమజ్జనం ఊరేగింపులో వైస్ చైర్మన్ మాలతీరెడ్డి, విద్యార్థులు



నిమజ్జనం ఊరేగింపులో మెగా కళాశాల విద్యార్థుల నృత్యం

మిత్రుడి కుటుంబసభ్యులకు ఆర్థిక సాయం



సాయం అందజేస్తున్న దృశ్యం

కీసర: కలిసి చదువుకున్న మిత్రుడు గుండె పోటుతో మరణించడం తోటి మిత్రులను కలిచివేసింది. కుటుంబ పెద్ద మృతి చెందడంతో కష్టాల్లో ఉన్న మృతి చెందిన తమ మిత్రుడి కుటుంబ సభ్యులను ఆదుకుకోవాలని మిత్రులందరూ ముందుకొచ్చారు. ఇటీవల మృతిచెందిన తమ మిత్రుడు కీసర శివాజీ నగర్ కాలనీకి చెందిన సాదాల ఆంజనేయులు(43) కుటుంబ సభ్యులకు మృతుడి మిత్రులు ఒక్కొక్కరుగా చేయిచేయి కలిపారు. వారికి తోచిన సాయం చేసే దిశగా ఆలోచన చేసి రూ. 57 వేలు జమచేశారు. ఆదివారం అందరూ కలిసి మిత్రుడు ఆంజనేయులు భార్య, ఇద్దరు చిన్నారులు, తల్లిదండ్రులను, ధైర్యం చెప్తూ ఆర్థిక సాయాన్ని అందజేశారు. మాటలు కాదు స్నేహమంటే ఇదేరా అంటూ ఆ కుటుంబం అండగా నిలవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

పట్టుదలతో లక్ష్యాలను చేరుకోవాలి



మలక్‌పేట: విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి పట్టుదలతో కృషి చేయాలని ప్రగతి కాలేజీ చైర్మన్ ఆర్. రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్ ప్రగతి డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంజురెడ్డి, డైరెక్టర్ చిన్నారెడ్డి, సెక్రటరీ, కరస్పాండెంట్ సీతారామ్‌రెడ్డి పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల కోర్టు వివాదాలు పరిష్కరించాలి

చాదర్‌ఘాట్: మంఖాల్-2 డబుల్ బెడ్రూమ్ సముదాయంలో తమకు ఇళ్లు కేటాయించాలని, కోర్టులో వివాదం త్వరగా పరిష్కారం అయ్యేలా ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని మంఖాల్-2 డిగ్నిటీ హౌస్ వెల్ఫేర్ అసోషియేషన్ గౌరవ అధ్యక్షుడు ఖాజా అన్నారు. ఆదివారం నిర్వహించిన మంఖాల్-2 డిగ్నిటీ హౌస్ వెల్ఫేర్ అసోషియేషన్ సభ్యుల సమావేశంలో ఖాజా మాట్లాడుతూ.. కోర్టు వివాదాన్ని త్వరగా పరిష్కరం చేసే విధంగా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించడం లేదన్నారు. కోర్టులో వివాదం కారణంగా ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడం లేదని వాపోయారు. రెవెన్యూ అధికారులు కేసును పరిష్కరించేలా చర్యలు తీసుకోవడం లేదని, దీంతో మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందన్నారు. హైకోర్టులో సింగిల్ బెంచ్ పై ఉన్న కేసును డబుల్ బెంచ్‌పై తీసుకెళ్లేందుకు లబ్ధిదారులు అందరూ ఏకమై న్యాయవాదిని సంప్రదించాలని పిలుపునిచ్చారు.

సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం



వేడుకల్లో పాల్గొన్న డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం

నాగోలు: సమాజ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మం అన్నారు. ఇటీవల నిర్వహించిన అసిస్టెంట్ ఎగిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) గెజిటెడ్ పరీక్షలలో చైతన్యపురి రూప ఐఏఎస్ అకాడమీకి చెందిన 613 విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఆదివారం కొత్తపేటలో రూప ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సక్సెస్‌మీట్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రపంచంలో అత్యధిక ఇంజినీర్లు ఉన్న దేశాల్లో భారత్ ముందు వరసలో ఉందన్నారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య మాట్లాడుతూ..ఉద్యోగాలు సాధించిన వారు తమ వృత్తిలో రాణించాలని, పట్టుదలతో ముందుకు సాగి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలోఅకాడమి డైరెక్టర్, స్వరూపరాణి, ఫ్యాకల్టీ వీరబాబు, ఎగిక్యూటివ్ ఇంజినీర్ జగతి కాసీం, ఓయు అసిస్టెంట్ ప్రొఫెసర్ గజ్జ శ్రీరామ్ పాల్గొన్నారు.

తోపుడు బండ్లపైకి దూసుకొచ్చిన లారీ

మల్లాపూర్: నాచారంలో ఓ గ్యాస్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు పక్కన ఉన్న తోపుడు బండ్లపైకి దూసుకొచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. (ఏపీ 28టీబీ5005) గ్యాస్ సిలిండర్ లారీ నాచారం సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఉన్న తోపుడు బండ్లపైకి దూసుకొచ్చింది. దీంతో పండ్లు, కూరగాయలు, పూలు నేలపాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. నాచారం పోలీసులు లారీతో పాటు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువతి మృతి

కీసర: అనుమానాస్పద స్థితిలో ఓ యువతి మృతి చెందింది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం గొల్లగూడెంకు చెందిన దేశ్‌పాండే రవి కూతురు క్యావ(18) కీసరలోని ఎస్ఎస్ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుంది. ఆమెకు ఆర్యోగం బాగోలేక తాను పనిచేసే ఆస్పత్రిలో వైద్యుడు ఇచ్చిన మాత్రలు వేసుకుంది. వెంటనే ఆపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు వచ్చిన కుటుంబ సభ్యులు ఆమెను మెరుగైన వైద్యం కోసం భువనగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నగరంలోని గాంధీ ఆస్పత్రికి బాధితురాలిని తరలించారు. గాంధీ ఆస్పత్రి వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందిందని ధ్రువీకరించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య వివరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

సైదాబాద్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా పురస్కారాలు అందుకున్న సైదాబాద్‌లో నివసించే డాక్టర్ వేముల నారాయణ, డాక్టర్ ఎస్. విజయభాస్కర్‌ను కలాం విజన్ సంస్థ ప్రతినిధులు సన్మానించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఇరువురికి ఆచార్య దేవోభవ-2024 అవార్డులను అందజేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనే లక్ష్యం కావాలి



రాజ్యాంగ ప్రతులను ప్రదర్శిస్తున్న రఘు, అరుణ్‌కుమార్

ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీటీసీ దేకొండ రఘు అన్నారు. ఆదివారం అంబేడ్కర్ ఆలోచన విధానాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంబేడ్కర్ బడుగుల కోసం అహర్నిశలూ కృషి చేయాలన్నారు. నేతలు దాసు, శ్రీనివాస్, రమేశ్, వీరేశ్, కల్యాణ్, బాబురావు, మహేశ్వర్, నర్సింగ్‌రావు, సత్యం, శ్రీరామ్, జగదీశ్, ఆనంద్, విష్ణు, భరత్, అఖిల్ పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో లడ్డూ వేలం



లడ్డూను వేలంలో దక్కించుకున్న చీరాల వెంకటేశ్



డాక్టర్ నరేంద్ర, సింధూర

బోడుప్పల్: శ్రీసాయి ఎన్‌క్లేవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక లడ్డూ 28వ డివిజన్ కార్పొరేటర్ చీరాల నర్సింహ్మా, అనిత దంపతుల కుమారుడు వెంకటేశ్ రూ. 1,26,000లకు దక్కించుకున్నారు. పట్టు వస్త్రాలను కాలేరు సుధాకర్, మాధవి రూ. 64,4001లకు, ఖద్దరు వస్త్రాలను వనం గణేష్, ఉష దంపతులు రూ. 40,116, కలశం, వస్త్రం సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతులు రూ. 29,700లకు కైవసం చేసుకున్నారు.

రామంతాపూర్ : నెహ్రూనగర్‌లోని ఐశ్వర్య హైట్స్ అపార్ట్‌మెంట్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తి శ్రద్ధలతో పూజలందుకుంటున్న గణనాథుడి లడ్డూ వేలం పాటఆదివారం పోటాపోటీగా జరిగింది. డాక్టర్ నక్క నరేంద్ర, డాక్టర్ సింధూర దంపతులు రూ.65,116లకు వేలం పాటలో దక్కించుకున్నారు. మాజీ కార్పొరేటర్ గంధం జ్యోష్న నాగేశ్వర్‌రావు డాక్టర్ దంపతులకు లడ్డూను అందజేసి ఘనంగా సన్మానించారు.

హిందూ ధర్మ రక్షణే ఎజెండాగా ముందుకు సాగాలి

చంచల్‌గూడ: ఆంక్షల పేరుతో హిందువుల పండుగలను అడ్డుకోవడం గత, ప్రస్తుత ప్రభుత్వానికి అలవాటుగా మారిందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, శ్రద్ధాబాద్ ప్రాంత గణేష్ ఉత్సవ సమితి నాయకుడు సహదేవ్‌యాదవ్ ఆరోపించారు. ఆదివారం కుర్మగూడలో జరిగిన గణేష్ మండప నిర్వాహకుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. హైందవ ధర్మ రక్షణకు శ్రద్ధాబాద్ ప్రాంతం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వాలు మారినా రాష్ట్రంలో హిందూ పండుగలు, ఉత్సవాల పట్ల అనచివేత ధోరణి కొనసాగుతుందన్నారు. పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు హిందూ ధర్మ రక్షణే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగాలన్నారు. నిమజ్జన ఉత్సవానికి అవసరమయ్యే వాహనాలను ఉత్సవ సమితి సమకూరుస్తుందని భారీ వాహనాల కోసం నిర్వాహకులు హైవేల వెంటపడి ప్రమాదాలకు గురికావద్దన్నారు. ఊరేగింపులను సకాలంలో ప్రారంభించాలన్నారు.

గణేశ శరణం.. శరణం గణేశా..



అత్వెల్లిలో హోమంలో పాల్గొన్న భక్తులు



మేడ్చల్‌లో పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు



కీసరలోని డబుల్ బెడ్‌రూం వద్ద...



కీసర ప్రధాన చౌరస్తాలో అన్నప్రసాద వితరణ



నాగారం భవానీనగర్‌లో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

'సుప్రభాతం' నాటక ప్రదర్శన

మల్లాపూర్: రవి అండ్ రవి ఆర్ట్స్ అసోసియేషన్ 66 వార్షికోత్సవం సందర్భంగా రక్త కన్నీరు నాగభూషణం బిరుదు గ్రహీత, దర్శకుడు మాడుగుల కృష్ణమోహన్ రచించిన 'సుప్రభాతం' నాటికను ఆదివారం మల్లాపూర్‌లో రేణుక ఎల్లమ్మ, ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద 1249 నాటికను ప్రదర్శించారు. నటుడు కృష్ణమోహన్, నటీమణి మనుప్రియ, సహాయనటులు రమేష్‌గౌడ్, జంగయ్యగౌడ్, సత్యనారాయణ,ఫణీందర్, సాయిపవన్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

మల్లాపూర్: రాష్ట్రస్థాయి ఖోఖో క్రీడా పోటీలకు మోడ్రన్ హైస్కూల్ విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ ముత్యంరెడ్డి తెలిపారు. మౌలాలి హౌజింగ్ బోర్డులో జరిగిన తెలంగాణ ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 34వ రాష్ట్రస్థాయి పోటీలకు రంగారెడ్డిజిల్లా జట్టు తరుపున మోడ్రన్ స్కూల్ విద్యార్థినులు అండర్-14 విభాగంలో ఆర్.వింధ్య, భవ్య ప్రతిభ కనబరచగా.. వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. కరస్పాండెంట్ సచీదేవి, ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీప్రసన్న విద్యార్థినులను ఈ సందర్భంగా అభినందించారు. పీఈటీ నరేందర్ ఉన్నారు.

మెట్రోస్టేషన్ వద్ద పార్కింగ్ ఫీజును ఎత్తివేయాలి

ఉప్పల్: నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్‌ను కొనసాగించాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతున్నట్లు పీవైఎల్, డీవైఎఫ్ఐ, ప్రయాణికులు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకుని పార్కింగ్ వసూలు చేయడం సరికాదని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు చొరవ తీసుకుని నగరంలోని మెట్రో స్టేషన్ల వద్ద ఉచిత పార్కింగ్ వసతిని కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.ఎస్ ప్రదీప్, అనగంటి వెంకటేష్, రవికుమార్, కృష్ణ, ఎండీ జావిద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

మల్లాపూర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులపై దృష్టిసారిస్తున్నామని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మల్లాపూర్‌లోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన గుంతలకు పాచ్‌వర్క్స్‌ను కార్పొరేటర్ పరిశీలించారు. తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, హమాలీ శ్రీను, పీఆర్.ప్రవీణ్, దయాకర్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తుల పంపిణీ



కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత దూసరి నవీన్‌గౌడ్ తల్లి కళమ్మ జ్ఞాపకార్థం ఆదివారం హెచ్‌బీకాలనీలో వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుస్తులు, ఆహారం పంపిణీ చేశారు. వారి కుటుంబసభ్యులు వృద్ధులతో కలిసి భోజనం చేశారు. దూసరి అశోక్‌గౌడ్, అరుణ్‌గౌడ్, ప్రసాద్, సంతోష్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆహారం పంపిణీ



మల్కాజిగిరి: మల్కాజిగిరి జీహెచ్ఎంసీ కార్యాలయం వద్ద శ్రీకా సత్యసేవా సహకార సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం సుమారు 59 మంది దివ్యాంగులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు వినయ్, నిర్వాహకులు అడ్వకేట్ శర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యం కారణంగా ఓ వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ శారదానగర్ రాఘవేంద్ర అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే శ్రీనివాస్‌గౌడ్(77) గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో రేలింగ్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుమారులు పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసును దర్యాప్తు చేస్తున్నారు.